# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

# నల్లగొండ

3

మంగళవారం 5 మార్చి 2024


**హెల్ప్‌లైన్ నంబర్లు**

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

**చికెన్ ధరలు**

గుడ్డు డజన్ ధర : 60

| జిల్లా | లైవ్ | డ్రెస్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| యాదాద్రి | రూ.145 | 215 | 244 |
| సూర్యాపేట | రూ.165 | 230 | 260 |
| నల్లగొండ | రూ.146 | 206 | 246 |

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.5 । కనిష్ఠం 24.0

# సాగుకు 24 గంటలు



» వ్యవసాయ విద్యుత్‌పై అలర్ట్! » సాగుకు 24గంటల నిరంతర సరఫరాకు ఆదేశాలు
» అధికారులు, సిబ్బంది నడుమ సమన్వయలోపముంటే చర్యలు » జిల్లాలో విద్యుత్ సరఫరాపై డిస్కం సీఎండీ ముషారఫ్ సమీక్ష

వ్యవసాయ రంగానికి విద్యుత్‌సరఫరాపై అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లాలో వ్యవసాయానికి విద్యుత్ వినియోగం పెరగడంతో కోతల్లేకుండా సరఫరా చేసేందుకు యాక్షన్ ప్లాన్ రూపొందించారు. పంటలు చేతికందె వరకూ ఏక్షణంలో కూడా కరెంటు లేకపోవడం వల్ల పైరు ఎండిందనే అపవాదు రావద్దనే స్పష్టమైన లక్ష్యంతో రంగంలోకి దిగుతున్నారు. సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో విద్యుత్ అధికారుల ఉన్నతస్థాయి సమీక్షలో సదరన్ డిస్కం సీఎండీ ముషారఫ్ సాగు రంగానికి విద్యుత్ సరఫరాపై ఉద్యోగులకు, సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలిచ్చారు.

(ఆంధ్రజ్యోతిప్రతినిధి- నల్లగొండ)

నల్లగొండ జిల్లాలో నిడమనూరు,త్రిపురారం మండలాల్లో ఫిబ్రవరిలో విద్యుత్ కోసం రైతులు ధర్నా చేసిన అంశంపై ప్రభుత్వం సీరియస్‌గా స్పందించి విచారణకు ఆదేశించడంతో ఉన్నతాధికారుల్లోనూ కదలిక వచ్చింది. విద్యుత్‌కోతలపై ధర్నాలకు సరఫరాలోటు సమస్య కానేకాదని, ఉద్యోగుల మధ్య సమన్వయలోపమే కారణంగా విచారణ కమిటీ తేల్చడంతో నల్లగొండ ఎస్ఈకి, మిర్యాలగూడ డీఈకి చార్జిమెమోలు జారీ చేయగా, తాజాగా సోమవారం మిర్యాలగూడ డీఈపై బదిలీవేటు వేయడం ద్వారా అధికారులు, ఉద్యోగులకు చురక తగిలించినట్లైంది.

### యాసంగి సాగుకు అనూహ్యంగా పెరిగిన విద్యుత్ వినియోగం

జిల్లాలో యాసంగి సీజన్‌లో నాగార్జునసాగర్, ఏఎమ్మార్పీ, మూసీ ప్రాజెక్టుల కింద క్రాప్ హాలిడే ప్రకటించడం, దానికితోడు భూగర్భజలాలు అడుగంటడంతో ఈసారి యాసంగిసాగుకు విద్యుత్ వినియోగం అనూహ్యంగా పెరిగింది. పండ్ల తోటలతో పాటు యాసంగి పంటలకు పూర్తిగా బోరుబావుల నీరే ఆధారమైంది. ఎండలు పెరగడం, భూగర్భజలాల నీటిమట్టాలు పడిపోవడంతో బోరుబావులకు విద్యుత్‌వినియోగం అనివార్యంగా పెరిగింది. ఈ డిమాండ్ నేపథ్యంలో మార్చిలో గరిష్ఠంగా 25ఎంయూడీ (మిలియన్ యూనిట్స్ పర్ డే) విద్యుత్ అవసరముంటుంద నే అంచనాతో సరఫరాలో లోటులేకుండా చూసేందుకు ప్రభుత్వం గ్రిడ్‌ల నుంచి విద్యుత్ సరఫరాకు సన్నాహాలు చేసింది. గతేడాది ఈ సీజన్‌లో సుమారు 18 నుంచి 19 మిలియన్‌యూనిట్ల వాడకం ఉంటే, ఈసారి దాదాపు 40 శాతానికి పైగా డిమాండ్ పెరిగిందని అధికారులు చెబుతున్నారు. ఎంతడిమాండ్ ఉన్నప్పటికీ విద్యుత్ సరఫరాలో లోటు లేకుండా చూస్తామని ప్రభుత్వం ఆదేశాలివ్వడంతో క్షేత్రస్థాయిలో పంపిణీలో లోపాల్లేకుండా చూసేందుకు ఉన్నతాధికారులు ఆదేశాలిస్తున్నారు. జిల్లాలో 2,17,660 వ్యవసాయ కనెక్షన్లుంటే, తాజాగా ఈ రెండు నెలల్లో 10వేల వరకు అదనపు వ్యవసాయకనెక్షన్లు ఏర్పాటయ్యాయని చెబుతున్నారు.

### కరెంటు లేక పైరు ఎండిందన్న మాటే రావద్దు

"వ్యవసాయానికిచ్చే విద్యుత్ సరఫరాలో ఎక్కడా రాజీ పడొద్దు. కరెంట్ లేక పైరు ఎండుతుందనే మాటే రావద్దు. ప్రభుత్వ నిర్ణయం మేరకు వ్యవసాయఫీడర్లకు 24 గంటల నిరంతర సరఫరా కొనసాగాలి. రైతులు ఏ సమయంలో పంపుసెట్లు నడుపుకోవాలంటే ఆ సమయంలో ఆ టంకం లేకుండా విద్యుత్ సరఫరా ఉండాలి. ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్ల మరమ్మతులుంటే జాప్యం లేకుండా పనులుచేయాలి. డిస్కం అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమన్వయంతో నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేలా పనిచేయాలి.

- ముషారఫ్, సదరన్ డిస్కం సీఎండీ.

### వ్యవసాయ ఫీడర్లకు నిరంతర సరఫరా



జిల్లాలో వ్యవసాయ ఫీడర్లకు నిరంతరం త్రీఫేజ్ విద్యుత్ సరఫరా కొనసాగించాలని ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. 24 గంటలూ ఫీడర్లకు సరఫరా ఇవ్వాలని, రైతు తన బోరుబావి పంపుసెట్టును ఏ సమయంలో నడపాలని భావిస్తే, ఆ సమయంలో మోటారు పనిచేసేలా విద్యుత్ సరఫరా ఉండడమే తమ లక్ష్యంగా ప్రతి ఉద్యోగి పనిచేయాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు. ప్రధానంగా ఎండాకాలంలో ఎదురయ్యే ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులకు రోజుల తరబడి సమయం తీసుకోవద్దని, విద్యుత్ అధికారులే ట్రాన్స్‌ఫార్మర్లు తీసుకువచ్చి ఒకే రోజులో మరమ్మతుచేసి మళ్లీ కనెక్షన్ పునరుద్ధరించాలని తాజా సమీక్షలో స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఎల్‌సీల విషయంలోనూ ప్రణాళికలేకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తే కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, ఇతర ఏవైనా సమస్యలు తలెత్తినా ఉన్నతాధికారుల సూచనలతో అతిస్వల్ప సమయంలో పూర్తయ్యేలా చూడాలని అంతిమంగా వ్యవసాయానికిచ్చే విద్యుత్ సరఫరాలో ఎక్కడా లోటు లేకుండా చూడాలని ఆదేశించడం ద్వారా క్షేత్రస్థాయి ఉద్యోగులు, సిబ్బందిని అప్రమత్తం చేశారు.

# ఎండలు మండే

జిల్లాలో ఎండల తీవ్రతకు ప్రజలు తల్లడిల్లుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి రెండో వారం నుంచి ఎండలు అధికంగా నమోదవుతున్నాయి. ఈ నెలలో ఎండలు ఇంకా అధికంగా నమోదయ్యే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మరో మూడు నెలలపాటు అంటే జూన్ మొదటి వారం వరకు ఎండలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయి. ఏప్రిల్, మే మాసంలో ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. జిల్లాలో అప్పుడే 36 డిగ్రీలకు పైగా పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

- నల్లగొండ

భానుడి భగభగతో తల్లడిల్లుతున్న ప్రజలు
ఉదయం 9 గంటల నుంచే వాతావరణంలో వేడి



నిర్మానుష్యంగా నల్లగొండలోని దేవరకొండ రోడ్డు

ప్రస్తుతం సాధారణం కంటే అధికంగానే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా గరిష్ట ఉష్ణోగ్రతలకు పోటీపడేలా ఉంటున్నాయి. రాబోయే రోజుల్లో ఎండలకు తోడు వడగాడ్పులు కూడా వీచే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ పేర్కొంది. అదేవిధంగా వడగాడ్పులతో పాటు వేడి వాతావరణం రోజుకు ఎక్కువైతే ప్రజలకు ఇబ్బందులు తప్పేలా లేవు.గత ఏడాది వర్షాలు సరిగ్గా లేకపోవడంతో భూమిలో వాతావరణం వేడెక్కిందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. వాతావరణంలో తేమశాతం తగ్గటం భూమిలో వేడి ఎండలను మరింత ఎక్కువ ఉండేలా పరిస్థితులు ఏర్పడ్డాయి.

### ఎండలో ప్రజలకు జాగ్రత్తలు తప్పనిసరి

రోజురోజుకూ ఎండలు పెరుగుతుండడంతో బయటకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వైద్యులు తెలిపారు. లేకుంటే అనేక అనారోగ్యానికి గురవుతారని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. రోజుకు కనీసం మూడు నుంచి నాలుగు లీటర్ల నీళ్ల తాగితే ఎండ నుంచి బయటపడవచ్చు. సాధారణంగా వివిధ పనులపై వెళ్లే వారితో పాటు ఉద్యోగాలు చేసేవారు సైతం జాగ్రత్తలు తీసుకుంటూ అదనంగా మరో లీటర్ నీరు అంటే నాలుగు లీటర్లు తాగాల్సి ఉంటుందని సూచిస్తున్నారు. వేసవిలో చెమట రూపంలో అధికంగా శరీరం నుంచి నీరు బయటకు వెళ్లిపోతుంది. దీంతో ఎప్పటికప్పుడు నీటిని తాగుతూ రక్షణ కల్పించుకోవాల్సిన అవసరం ఉందని వైద్యులు తెలిపారు. శరీరంలో ఉష్ణోగ్రతల మార్పులతో తలనొప్పి, జ్వరం, గొంతులో మంటలు వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఎండలో బయటికి వెళ్లి వచ్చినవారు కనీసం ఐదు నిమిషాల విశ్రాంతి తీసుకోవాలి.

### చల్లటి పానీయాలకు భలే గిరాకి

ఎండలు మండుతుండటంతో ప్రజలు చల్లటి పానీయా ల వైపు చూస్తున్నారు. కూల్ డ్రింక్‌లతో పాటు చెరుకు రసం, పుచ్చకాయలు, ఐస్ క్రీం, మజ్జిగ, లస్సీ వంటివి అధికంగా తీసుకుంటున్నారు. చల్లటి పానీయాలకు ధరలు కూడా మండుతున్నాయి. కూలర్లు కూడా పెద్దఎత్తున విక్రయాలు జరుగుతున్నాయి. మధ్యతరగతి ప్రజలు కూలర్లు వాడుతుండగా కాస్త ఆర్థికంగా ఉన్నవారు ఏసీలను వినియోగిస్తున్నారు.

జిల్లాలో ఉష్ణోగ్రతలు(సెంటీగ్రేడ్లలో)

| తేదీ | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| 27న | 24.2 | 34.0 |
| 28న | 23.4 | 34.5 |
| 29న | 23.8 | 35.0 |
| 1న | 23.4 | 34.5 |
| 2న | 23.6 | 35.0 |
| 3న | 23.8 | 36.0 |
| 4న | 24.0 | 36.5 |

### ఎండలతో అప్రమత్తంగా ఉండాలి

ఎండలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వీలైనంత మేరకు ఉదయం సాయంత్రం వేళల్లో పనులు చూసుకోవాలి. అవసరమైతేనే బయటకు వెళ్లాలి. బయటకు వెళ్లేవారు గొడుగుతో పాటు టోపీని ధరించాలి. వీలైనంత మేరకు వదులుగా ఉన్న దుస్తులతో పాటు కాటన్ దుస్తులు ధరించాలి. జీన్స్‌తో పాటు పాలిస్టర్ వంటి దుస్తులను సాధ్యమైనంత వరకు వేసవిలో దూరంగా ఉంచాలి.



- విఠల్‌బాబు, ఎండీ జనరల్ ఫిజిషియన్

# పల్లెల్లో తాగునీటికి కటకట

మార్చి నెల మొదటి వారంలోనే ఎండలు సుర్రుమంటున్నాయి. ఏడాది కాలంగా నల్లగొండ జిల్లాలో సాధారణ వర్షపాతం కూడా నమోదు కాకపోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. వ్యవసాయ బావు లు పూర్తిగా ఎండిపోగా 200 అడుగుల లోతుకు మించి బోర్లు వేస్తేనే ఆగి ఆగిపోస్తున్నాయి. చెరువులు, కుంటలు సైతం వట్టిపోవడంతో అనేక గ్రామాల్లో తాగు నీటి సమస్య నెలకొంది. వేసవి తీవ్రరూపం దాల్చకముందే నివారణ చర్యల్లో భాగంగా అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

- (మిర్యాలగూడ)





నాగార్జున సాగర్‌లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా



» అనేక గ్రామాల్లో సరఫరా కాని భగీరథ నీరు
» ట్యాంకర్ల నీటిని కొనుగోలు చేస్తున్న జనం
» మంచినీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక కార్యాచరణ
» ఉమ్మడి జిల్లాలో రూ. 17 కోట్లకు ప్రతిపాదనలు

దేవరకొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో ప్రజలు మంచినీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాది వర్షాలు సరిగా కురవకపోవడం, కృష్ణానదికి వరద సైతం రాకపోవడంతో జలాశయంలో నీటినిల్వలు గణనీయంగా పడిపోయాయి. ఫలితంగా ఎడమకాల్వ ఆయకట్టుకు నీటివిడుదల జరగలేదు. ఆయకట్టులో యాసంగి క్రాప్ హాలిడే ప్రకటించారు. రైతులు పంటల సాగుకు బోర్లు, బావులపైనే ఆధారపడాల్సి వచ్చింది. అధిక సంఖ్యలో బోర్ల వినియోగంతో కృష్ణపట్టెలో భూగర్భజలాలు తగ్గిపోయాయి. నల్లగొండ జిల్లాలో సాధారణ వర్షపాతం కంటే 18.6 శాతం లోటుగా నమోదైయింది. సుమారు 14 మండలాల్లో సగటు వర్షపాతం కంటే తక్కువగా నమోదైయింది.

నల్లగొండ జిల్లాలో 2022 డిసెంబరులో భూగర్భజలం 4.51మీటర్లు కాగా 2023 డిసెంబరు లో 7.22 మీటర్ల లోతుకు పడిపోయింది. ఫిబ్రవరి నెలాఖరుకు మరింతగా పడిపోయింది.దీంతో గ్రామాల్లో మంచినీటికి వినియోగించే బోర్లలో నీటి లభ్యత తగ్గి తాగు నీటిఎద్దడి మొదలైంది. మూసీ, ఎస్సారెస్పీ కింద యాసంగిలో ఆన్అండ్‌ఆఫ్ కింద కాల్వలకు నీటి విడుదల చేయడంతో నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలో కొన్ని మండలాల్లో భూగర్భజలాలువృద్ధి చెందాయి. ప్రస్తుతంమంచినీటి సమస్య ప్రభావం అంతగా లేదని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

### వేసవి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ప్రత్యేక కారాచరణ

వేసవిలో మంచినీటి సమస్య తీవ్రరూపం దాల్చకుండా అధికార యంత్రాంగం ముందస్తు కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే తాగు నీటి సమస్య ఎదుర్కొంటున్న గ్రామాలను గుర్తించి అవకాశం ఉన్న ప్రాంతాల్లో నూతన బోర్లు వేయడం, పాతబోర్లకు మరమ్మతులు చేయించడం, ప్రైవేట్ వ్యక్తుల బోర్ల నుంచి నీటిని కొనుగోలు చేయడం, దెబ్బతిన్న భగీరథ పైపులైన్లు మరమ్మతులు చేసి ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీరు సరఫరా చేయడం, నల్లాల ద్వారా ఇళ్లకు తాగునీరు సరఫరా చేసేలా చూడాలని సమస్య జటిలంగా వున్న చోట ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసేందుకు రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, వ్యవసాయ, తహసీల్దార్లు తదితర వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అంచనా వ్యయాన్ని రూపొందించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నెల 20లోగా అన్ని పనులను పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో అధికారులు యుద్ధ ప్రాతిపదికన ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిసింది.

### ఉమ్మడి జిల్లాలో రూ.17 కోట్లతో ప్రతిపాదనలు

వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణ చర్యల్లో భాగంగా పనులు చేపట్టేందుకు ఉమ్మడి నల్లగొండ జిల్లా అధికారులు ప్రతిపాదనలు పంపించారు. నల్లగొండ జిల్లాలో రూ.9.17 కోట్లు, సూర్యాపేట జిల్లాలో రూ.5.7 3 కోట్లు, యాదాద్రి భువనగిరి జిల్లాలో రూ.3కోట్ల పనులకు నివేదికలు రూపొందించి ప్రభుత్వానికి పంపించారు. నల్లగొండ జిల్లాలో 1,253 బోర్లకు రూ.4.17 కోట్లు, 1,014 పంపులకు రూ.2.06 కోట్లు వ్యయమవుతున్నట్లు అధికారులు అంచనా వేశారు. ప్రధానం సూర్యాపేట జిల్లాలో నాగారం మండలం లో 2గ్రామాలు, జాజిరెడ్డిగూడెం 2, తిరుమలగిరిలో 8, హు జూర్‌నగర్ 2, గరిడేపల్లి 33, మఠంపల్లి 25, మేళ్లచెర్వు 9, చింతలపాలెం 4, నేరేడుచర్ల 1, పాలకవీడు 3, అనంతగిరి 17,చిలుకూరు 15, నడిగూడెం 6, మొత్తం 127 గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేయాల్సివుంటుందని నివేదిక సిద్ధం చేసినట్లు సమాచారం.

### వరికి ట్యాంకర్‌తో నీళ్లు



ఎండుతున్న పొలానికి ట్యాంకర్‌తో నీళ్లు పెడుతున్న శ్రీను

త్రిపురారం: నల్లగొండ జిల్లా త్రిపురారం మండలకేంద్రంలో వరి పంట ఎండిపోతుండటంతో ట్యాంకర్‌తో నీళ్లు పెడుతున్న దృశ్యాలు కన్నీరు పెట్టిస్తున్నాయి. రైతు నగిరి శ్రీను 4 ఎకరాలలో వరి సాగు చేయగా పంట చేతి కొచ్చే సమయంలో ఉన్న మూడుబోర్లు, బావి ఎండిపోవడంతో ఈ పరిస్థితి దాపురించింది.

### మూడు రోజులుగా నీటి సరఫరా బంద్

నాగార్జునసాగర్: చెంతనే కృష్ణమ్మ ఉన్నా సాగర్‌వాసులకు దాహార్తి తీరడం లేదు. మూడు రోజులుగా హిల్‌కాలనీ, పైలాన్‌కాలనీలలో ఇళ్లకు తాగునీటి సరఫరా నిలిచి స్థానికులు ఇబ్బందులుపడుతున్నారు. వేసవికి ప్రారంభానికి ముందే నీటి ఎద్దడి ఏర్పడితే వచ్చే నెల నుంచి ఎలా అని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఫిల్టర్‌హౌజ్ ఏఈ బిక్షమయ్యను సంప్రదించగా కాలనీలకు నీటిని సరఫరా చేసే మోటార్లు మరమ్మతులకు గురయ్యాయని, పనులు చేయడానికి మరో రెండు రోజులు పడుతుందన్నారు.

## ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువచేయాలి



ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఏఎస్పీ

నల్లగొండ టౌన్, మార్చి 4 : ప్రజావాణి అర్జీలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని అదనపు ఎస్పీ రాములునాయక్ తెలిపారు. పోలీస్ శాఖ కూడా బాధితుల సమస్యలపై వెంటవెంటనే స్పందిస్తూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువచేయాలని ఆయన సూచించారు. సోమవారం గ్రీవెన్స్‌డేలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజల నుంచి 41 అర్జీలను తీసుకుని వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని అమలు పరుస్తూ, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.

## చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలి



పల్స్‌పోలియో కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డాక్టర్ కళ్యాణచక్రవర్తి

చింతపల్లి, మార్చి 4 : ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ కల్యాణ్‌చక్రవర్తి అన్నారు. సోమవారం మండలంలోని వీటీనగర్, చింతపల్లి పీహెచ్‌సీల పరిధిలో నిర్వహిస్తున్న పల్స్‌పోలియో కేంద్రాలను ఆయన తనిఖీచేశారు. చిన్నారులకు అందిస్తున్న పోలియో చుక్కల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మూడు రోజులపాటు ప్రతీ ఇల్లు తిరిగి ఏ ఒక్కరినీ వదలకుండా పోలియోచుక్కలు వేయాలన్నారు. ఆయన వెంట చింతపల్లి, పీహెచ్‌సీల వైద్యులు శ్రీదేవి, వంశీకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

## 'ప్రజావాణి' అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

నల్లగొండ టౌన్, మార్చి 4 : ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ దాసరి హరిచందన అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ ఎప్పటి ఫిర్యాదులు అప్పుడే పరిష్కరించాలని సూచించారు. దీంతో అర్జీదారులకు మేలు జరుగుతుందన్నారు. నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించాల్సిన అర్జీలకు ప్రాధాన్యమిచ్చి, వాటి పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపలన్నారు.

### అక్షరాస్యులను చేసేందుకు చర్యలు

రాష్ట్రంలో న్యూఇండియా లిటరసీ ప్రోగ్రాం కింద నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ దాసరి హరిచందన అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో తెలంగాణలో న్యూఇండియా లిటరసీ కార్యక్రమంపై ఆమె అధికారులతో సమావేశమయ్యారు. మొదటి సంవత్సరం జిల్లాలో నిర్దేశించిన లక్ష్యం మేరకు ఆయా శాఖల ద్వారా చదువురాని 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారిని గుర్తించి వారికి ఆన్‌లైన్ లేదా మొబైల్ ద్వారా విద్యనందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

### విశ్వకర్మ పథకంపై

ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద ఎక్కువమంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దాసరి హరిచందన అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో విశ్వకర్మ పథకంపై జిల్లా అధికారుల తో సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా మత్స్యశాఖ ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లు తదితర శాఖల ద్వారా చేతివృత్తుల వారికి ఇచ్చే యూనిట్లకు సంబంధించివారికి అవగాహన కల్పించి మరింత ఎక్కువమంది దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. ఆయా సమావేశాల్లో అదనపు కలెక్టర్ జే శ్రీనివాస్, డీఆర్‌వో రాజ్యలక్ష్మి, డీఈవో భిక్షపతి, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ కోటేశ్వరరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు తీసుకుంటున్న కలెక్టర్

# రైతులకు కట్టంగూరు ఎఫ్‌పీవో ఆదర్శం

» మిచిగన్ యూనినివర్సిటీ బృందం » కట్టంగూరు రైతు ఉత్పత్తిదారుల కంపెనీ పరిశీలన

కట్టంగూరు, మార్చి 4: ప్రపంచంలోనే చిన్న, సన్నకారు రైతులకు కట్టంగూరు రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ ఆదర్శమని అమెరికాలోని మిచిగన్ యూనివర్సిటీ ఎక్స్‌టెన్షన్ విభాగం డైరెక్టర్ క్వింటన్ ఆర్ టైలర్ అన్నారు. కట్టంగూరు మండలంలోని అయిటిపాముల గ్రామపంచాయతీ పరిధిలోని గంగాదేవిగూడెం సమీపంలో ఉన్న కట్టంగూరు ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్(ఎఫ్‌పీవో)ను సోమవారం ఆయన త న బృందం సభ్యులతో కలిసి పరిశీలించారు. అమెరికాలోని మిచిగన్ వ్యవసాయ విస్తరణ యూనివర్సిటీకి సంబంధించిన తొమ్మిది మందితో కూడిన బృందం సభ్యులు మూడు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం కట్టంగూరు రైతు ఉత్పత్తిదారుల కంపెనీని పరిశీలించారు. ఈ సందర్భంగా సభ్యులు నిమ్మ గ్రేడింగ్ యంత్రాన్ని, నిమ్మ ఒరుగుల తయా రీ,వ్యవసాయ పరికరాలు, సోలార్ కోల్డ్ స్టోరేజీ, కూరగాయల మార్కెటింగ్ విధానం, ఎరువులు, పురుగుల మందుల కొనుగోలు విధానం, నిమ్మకాయ పచ్చడి, నిమ్మకాయ జ్యూస్, గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డు డీడీఎం వినయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, ఉద్యాన అధికారి విద్యాసాగర్, కట్టంగూరు ఏవో శ్రీనివాస్, అధికారులు సుధాకర్‌రెడ్డి, ప్రసాద్, తిరుమల్‌రెడ్డి, నతీష్, వెంకటేశ్వర్లు, అశీష్‌రెడ్డి, ఎఫ్‌పీవో చైర్మన్ చెవుగోని సైదమ్మ, వైస్ చైర్మన్ లింగారెడ్డితో పాటు డైరెక్టర్లు పాల్గొన్నారు.



గంగాదేవిగూడెంలో గల రైతు ఉత్పత్తిదారుల కంపెనీ పరిశీలించిన మిచిగన్ స్టేట్ యూనివర్సిటీ ఎక్స్‌టెన్షన్ యూఎస్ఏ బృందం

# యాదగిరిక్షేత్రంలో నేటి నుంచి
# శివరాత్రి మహోత్సవాలు



శివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం ఏర్పాటుచేసిన చలువ పందిళ్లు

**యాదగిరిగుట్ట, మార్చి 4:** యాదగిరికొండపైన అనుబంధ దేవాలయమైన రామలింగేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు శైవాగమ పద్ధతిలో శివరాత్రి మహోత్సవాలు కొనసాగనున్నాయి. శివాలయ ఉద్ఘాటన అనంతరం రెండోసారి ఉత్సవాలు కొనసాగనుండడంతో దేవస్థాన అధికారులు ముందస్తుగానే ఏర్పాట్లు పూర్తిచేశారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు విఘ్నేశ్వరుడికి తొలి పూజలతో స్వస్తిపుణ్యావాచనంతో ఉత్సవాలకు శ్రీకారం పలకనున్నారు. ఈ నెల 7వ తేదీ రాత్రికి శివాలయ కల్యాణమండపంలో కొనసాగే శివకల్యాణోత్సవంలో పాల్గొనే భక్తులకు రూ.516 టిక్కెట్, 8న మహాశివరాత్రి రోజున ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగే అభిషేక పూజలకు రూ.300 టికెట్, రాత్రి మహాన్యాసపూర్వక శత రుద్రాభిషేకంలో పాల్గొనేందుకు రూ.516, 9వ తేదీన ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు లక్షబిల్వార్చన పూజల్లో రూ.516 టికెట్‌గా నిర్ణయించారు. ప్రతీ సేవలోనూ ఇద్దరు భక్తులు మాత్రమే పాల్గొనాలని అధికారులు తెలిపారు. 10వ తేదీ మధ్యాహ్నం యాగశాలలో మహాపూర్ణాహుతితో శివరాత్రి మహోత్సవాలు పరిసమాప్తమవుతాయి.

### హరిహరులకు విశేష పూజలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో సోమవారం హరిహరులకు విశేష పూజలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. కొండగుహలోని స్వయంభూ లక్ష్మీనారసింహుడికి పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో.. అనుబంధ శివాలయంలోని రామలింగేశ్వరుడికి, స్ఫటిక మూర్తులకు శైవాగమ పద్ధతిలో నిత్యవిధి కైంకర్యాలు నిర్వహించారు. అష్టభుజి ప్రాకార మండపంలో నిత్య తిరుకల్యాణోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.21,33,980ల ఆదాయం సమకూరినట్టు అధికారులు తెలిపారు. స్వామివారిని ప్రముఖ గాయకుడు ఎస్పీ చరణ్ దర్శించుకున్నారు.

## అర్చక, ఉద్యోగులకు హెల్త్ ఇన్సూరెన్స్

» అర్చక వెల్ఫేర్ బోర్డు తీర్మానం

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అర్చక, ఉద్యోగులకు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించేందుకు అర్చక వెల్ఫేర్ బోర్డు తీర్మానం చేసింది. బోర్డు చైర్మన్ నవీన్ మిట్టల్, దేవాదాయశాఖ కమిషనర్ అనిల్ కుమార్, విశ్రాంత హైకోర్టు జడ్జి వామన్‌రావు ఇతర అధికారులు సచివాలయంలో సోమవారం సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించారు. అర్చక, ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలు ఈ సమావేశంలో కొలిక్కి వచ్చాయి. ప్రధానంగా, దేవాదాయశాఖ పరిధిలో విధులు నిర్వహిస్తూ గ్రాంట్ ఇన్ ఎయిడ్ పద్దులో వేతనాలు పొందుతున్న అర్చక, ఉద్యోగులకు హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలని తీర్మానం చేశారు. అయితే, ఒకేసారి అందరికి కాకుండా దశల వారిగా అమలు చేయాలనే నిర్ణయానికి వచ్చారు. మొదటి విడతలో రూ.50 వేలలోపు వేతనం ఉన్నవారికి, అనంతరం పలు దఫాల్లో మిగతా వారికి హెల్త్ ఇన్సురెన్స్ కల్పించనున్నారు. ఇందుకోసం అన్ని జిల్లాల నుంచి అర్చక, ఉద్యోగుల సమాచార సేకరణ ప్రక్రియ తక్షణం ప్రారంభించాలని దేవాదాయశాఖ అధికారుల్ని కోరారు.

## బీఆర్ఎస్‌కు భవిష్యత్తు లేదు: కిషన్ రెడ్డి

ఆదిలాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి అసలు భవిష్యత్తే లేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన విజయ సంకల్ప సభలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ అంటేనే ఆదివాసీల గడ్డగా పేరుందని, ఈ ప్రాంతంలో కొమురంభీం, రాంజీ గోండు స్ఫూర్తిగా ఎన్నో పోరాటాలు జరిగాయని గుర్తు చేశారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. దేశ ప్రజల ఆశీస్సులతో మూడోసారి నరేంద్ర మోదీ ప్రధాని కావడం ఖాయమన్నారు. అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రె‌స్‌కు కూడా భవిష్యత్ లేదని ఆయన అన్నారు.

## గతేడాది యాసంగి సీఎంఆర్ గడువు పెంపు

» మే 15 తేదీ వరకు అవకాశం కల్పించిన కేంద్రం

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గతేడాది(2022- 23) యాసంగి సీజన్‌కు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) డెలివరీ గడువును రానున్న మే నెల 15 తేదీ వరకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. సీఎంఆర్ గడువు పెంచాలని గత ఫిబ్రవరి నెల 23 తేదీన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి రాసిన లేఖను పరిగణనలోకి తీసుకొని ఈ ఉత్తర్వులు ఇచ్చింది. బియ్యం రీసైక్లింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని, మిల్లుల వారీగా లిఖితపూర్వకంగా షెడ్యూలు తీసుకొని, ఎఫ్‌సీఐకి డెలివరీ చేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. ఎఫ్‌సీఐ క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని, డెలివరీ సమయంలో బియ్యాన్ని పరీక్షించి తీసుకోవాలని కూడా ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ ఉత్తర్వుల ఆధారంగా రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్.. వివిధ జిల్లాల మేనేజర్లు, డీఎస్‌వోలకు సోమవారం సర్క్యులర్ జారీచేశారు. యాసంగి సీజన్‌కు సంబంధించిన ధాన్యంలో ఇటీవల టెండర్లు పిలిచిన 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మినహాయించి.. మిల్లింగ్ ప్రక్రియ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### 5-6 నెలల తర్వాత..

# ఈ సర్కారుండదు

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నేతలతో ఆయన సమావేశమయ్యారు. పార్టీ నేతలతో పలు అంశాలపై చర్చించారు. సిటింగ్ ఎంపీలు నామా నాగేశ్వరరావుకు ఖమ్మం, మహబూబాబాద్‌లో మాలోతు కవితకు మరోసారి పోటీకి అవకాశం ఇవ్వాలని ఈ భేటీలో ఏకగ్రీవంగా తీర్మానించారు. అదేవిధంగా ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల ఎన్నికల ఇన్‌చార్జులుగా పల్లా రాజేశ్వర్ రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డిని నిర్ణయించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. కొద్దిరోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని, వారిపై ఉండే వ్యతిరేకతను బీఆర్ఎస్‌కు అనుకూలంగా మార్చుకుని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేద్దామని పార్టీ శ్రేణులతో అన్నారు. బీఆర్ఎస్‌ను వీడుతున్న వారివల్ల పార్టీకి ఎటువంటి నష్టం ఉండబోదని.. అలాంటి పరిణామాలను చూసి ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. 12న కరీంనగర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించిన అనంతరం.. ఖమ్మంలోనూ బహిరంగ సభ చేపడతామని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పార్టీ ఓడిపోయినా.. అధైర్యపడాల్సిన పనిలేదని, నాయకులు ధైర్యంతో ముందడుగు వేయాలని సలహా ఇచ్చారు. పార్టీని పటిష్ఠం చేసుకోవడంలో భాగంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికీ ముగ్గురితో సమన్వయ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. "బీఆర్ఎస్ పాలనలో సాగునీరు, తాగునీరు, విద్యుత్‌ను సమృద్ధిగా అందించడంతోపాటు సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుతో ప్రజలకు చేయాల్సింది చేశాం. అయినప్పటికీ.. వారు మనకు ప్రతిపక్ష పాత్ర ఇచ్చారు. మన విలువ ప్రజలకు తొందరలోనే తెలుస్తుంది" అన్నారు. రాష్ట్రంలో రైతు బంధు, దళితబంధు వంటి పథకాలు



తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో మాట్లాడుతున్న కేసీఆర్

ఎన్నికల కోసం తేలేదని, ఒక విజన్‌తో తెచ్చానని కేసీఆర్ చెప్పారు.

### ఎన్టీఆర్‌లాంటి నేతకే తప్పలేదు..

"రాజకీయాల్లో గెలుపోటములు సహజమే. ఎన్టీఆర్ లాంటి నేతకే ఒడుదొడుకులు తప్పలేదు.. ఆయన ముందు మనమెంత?" అని కేసీఆర్ ఈ భేటీలో వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ఉమ్మడి రాష్ట్రంలో పాతాళానికి పడిపోయి కూడా మళ్లీ అధికారంలోకి వచ్చిన టీడీపీని చూసి నేర్చుకోవాల్సింది చాలా ఉందని పేర్కొన్నారు. "అప్పట్లో టీడీపీ మన పార్టీ కంటే దారుణంగా ఓటమి చవిచూసింది. అయినప్పటికీ.. తప్పులను సరిదిద్దుకొని తిరిగి చేజిక్కించుకుంది" అని పార్టీ శ్రేణులకు గుర్తుచేశారు. "అసెంబ్లీ ఎన్నికల్లో మనం ఓడిపోవడం కూడా మంచిదే.. గుర్రం ఏదో.. గాడిదేదో తెలుసుకునే అవకాశం రాష్ట్ర ప్రజలకు వచ్చింద"ని కేసీఆర్ వ్యాఖ్యానించారు. కాగా.. ఈ సమీక్షా సమావేశానికి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు హాజరు కాలేదు. వెంకటరావు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం లాంచనమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### నలుగురు అభ్యర్థుల పేర్లు ఖరారు

రెండు రోజుల సమీక్షల అనంతరం కేసీఆర్ తమ పార్టీ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే నలుగురు అభ్యర్థుల పేర్లు ప్రకటించారు. కరీంనగర్ నుంచి బోయినపల్లి వినోద్‌కుమార్, పెద్దపల్లి నుంచి కొప్పుల ఈశ్వర్, ఖమ్మం నుంచి నామా నాగేశ్వరరావు, మహబూబాబాద్ నుంచి మాలోతు కవిత పోటీ చేస్తారని ఆయన వెల్లడించారు.

### కాంగ్రెస్ మోసపూరిత వైఖరిని ప్రజలకు చెప్పండి: హరీశ్

అధికారంలోకి వచ్చి 3 నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని.. అసంపూర్తిగా అమలుచేసిన రెండు, మూడు హామీల చూపించి అన్నీ చేసినట్లు ప్రచారం చేసుకుంటోందని.. రాష్ట్రంలో ఆ పార్టీ అనుసరిస్తున్న మోసపూరిత వైఖరిని క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి చెప్పాలని పార్టీ నేతలతో మాజీ మంత్రి టి.హరీశ్‌రావు పేర్కొన్నారు. ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల నేతలతో కేసీఆర్ సమీక్ష అనంతరం తెలంగాణ భవన్‌లో ఆ రెండు నియోజకవర్గాల అభ్యర్థులు, ముఖ్యనేతలతో హరీశ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ మోసాలపై ఎక్కడికక్కడ నిలదీయాలని, ప్రజల్లో చర్చ జరిగేలా చూడాలని సూచించారు. గల్లీలో కాంగ్రెస్ ఉన్నా, తెలంగాణ సమస్యలు ఢిల్లీ వేదికగా ప్రశ్నించేందుకు, పరిష్కరించేందుకు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు గెలవాలన్నారు. కాగా.. ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి రాహుల్ గాంధీనే కాక ఎవరు పోటీ చేసినా ఎదుర్కొంటామని.. ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు స్పష్టం చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉంటారన్నారు.



సిరిసిల్ల జిల్లా నారాయణపూర్‌లో జరిగే రేణుకామాత జమదగ్ని కల్యాణానికి రావాల్సిందిగా కేటీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న గౌడ సంఘం నేతలు

## ఎల్ఆర్ఎస్‌పై బీఆర్ఎస్ పోరుబాట

» 6న నియోజకవర్గాల కేంద్రాల్లో ధర్నాలు

» 7న కలెక్టర్లు, ఆర్డీవోలకు వినతిపత్రాలు: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం)పై తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ పోరు బాటకు సిద్ధమవుతున్నట్లు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు సి.లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌లతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఎటువంటి ఫీజు వసూలు చేయకుండా ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ అనుమతులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందుకుగాను తమపార్టీ ఆధ్వర్యంలో ఈనెల 6న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో, హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కార్యాలయాలవద్ద ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎల్ఆర్ఎస్ బాధితులను కలుపుకొని ఈ ధర్నాలు విజయవంతం చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా 33 జిల్లాల పరిధిలో ఈనెల 7న జిల్లా కలెక్టర్లు, ఆర్డీవోలను కలిసి వినతిపత్రాలు సమర్పించాలని నిర్ణయించినట్లు కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించాలని చెబితే రక్తమాంసాలు పీలుస్తున్నామని నాడు విమర్శించారన్నారు. గతంలో తాము ఎల్ఆర్ఎస్ తెస్తే కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోర్టుకు వెళ్లారని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్‌ను రద్దుచేస్తామని గతంలో భట్టివిక్రమార్క చెప్పారని, నో ఎల్ఆర్ఎస్.. నో టీఆర్ఎస్ అని వ్యాఖ్యానించారని గుర్తుచేశారు. అదేవిధంగా ఉచితంగా భూములను క్రమబద్ధీకరిస్తామని ఉత్తమ్ చెప్పారని, జనం సొమ్ము దోచుకోవడానికి ఎల్ఆర్ఎస్ తెచ్చారని సీతక్కకూడా అన్నారని పేర్కొన్నారు. ప్రజలపై ఆర్థికభారం మోపడానికి రంగం సిద్ధం చేశారని, రాష్ట్ర ప్రజల ద్వారా రూ.20వేల కోట్లు రాబట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని కేటీఆర్ ఆరోపించారు.

### ఉమ్మడి పాలమూరు నేతలతో కేటీఆర్ భేటీ

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక, లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి పార్టీ కార్యాచరణపై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నేతలతో కేటీఆర్ సమావేశమయ్యారు. తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన ఈ సమావేశంలో మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పేరును ప్రస్తావించినట్లు తెలుస్తోంది. పార్టీ అధినేత దృష్టికి తీసుకువెళ్లి.. ఆయన పేరును ఖరారు చేయనున్నట్లు సమాచారం.

## బయట పడిన చీకటి ఒప్పందం

» సభలో బీజేపీ, కాంగ్రెస్‌ల నైజం వెల్లడి

» చెవిలో పూలు పెట్టిన మోదీ, రేవంత్

» లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి కాంగ్రెస్ సాయం: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య ఉన్న చీకటి ఒప్పందం మరోసారి బయట పడిందని, ఆదిలాబాద్ సభలో ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి అలై బలై తీసుకున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మోదీ వద్ద మోకరిల్లడాన్ని.. యావత్ తెలంగాణ చూసిందని, వారిద్దరి మధ్య ఉండే బడే భాయ్.. చోటే భాయ్ బంధం ప్రజల ముందే బహిర్గతమైందన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో సోమవారం మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల కోసం కాంగ్రెస్, బీజేపీల మధ్య అవగాహన కుదిరిందని, ఉత్తర తెలంగాణలో బీజేపీకి కాంగ్రెస్ సహాయం చేస్తుందని ఆయన జోస్యం చెప్పారు. తెలంగాణ ప్రజల చెవిలో రేవంత్‌రెడ్డి కాలీఫ్లవర్ పెడితే.. మోదీ కమలం పువ్వు పెట్టారని ఆయన ఎద్దేవా చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎఫ్ఆర్‌బీఎం పరిమితి దాటి రుణం అడిగితే.. కేంద్రం ఇబ్బంది పెట్టిందని.. అదే రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక తీసుకోవడానికి ఎలా అనుమతించారని ప్రశ్నించారు. ప్రధాని మోదీని సీఎం రేవంత్ ఒక్క మాట కూడా అనరని, మాజీ సీఎం కేసీఆర్‌పై మాత్రం ఒంటికాలితో లేస్తారని ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ.. అదానీ బంధంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు చేస్తుంటే.. రేవంత్ మాత్రం అదానీతో ఒప్పందం చేసుకుంటున్నారని, ఈ ఇద్దరు కాంగ్రెస్ నేతల్లో ఎవరిని నమ్మాలని పల్లా రాజేశ్వర్ రెడ్డి నిలదీశారు.










## ఓఆర్ఆర్ లీజు బేస్ ప్రైస్ రూ.7300 కోట్లు!

(మొదటి పేజీ తరువాయి)

అప్పగించడంపై నిరుడు ఏప్రిల్ 28న 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో.. 'రాసిచ్చేశారు' అనే శీర్షికతో ప్రచురించిన కథనం రాష్ట్ర రాజకీయాల్లో దుమారం సృష్టించింది. తాము అధికారంలోకి వచ్చాక దీనిపై విచారణ జరిపిస్తామని టీపీసీసీ చీఫ్‌గా రేవంత్ రెడ్డి అప్పట్లో ప్రకటించారు. సీఎం కాగానే దీనిపై హెచ్ఎండీఏ అధికారుల నుంచి పూర్తిస్థాయి నివేదిక కోరారు. టెండర్లు ఆహ్వానించినప్పుడు బేస్‌ప్రైస్‌ను ప్రభుత్వం ప్రకటించకపోయినప్పటికీ.. టెండర్ వేసిన నాలుగు సంస్థల్లో ఐఆర్‌బీ సంస్థ రూ.7272 కోట్లు, దినేష్‌చంద్ర ఆర్ అగర్వాల్ ఇన్‌ఫ్రా రూ.7007 కోట్లు, గవర్ కన్‌స్ట్రక్షన్ రూ.6767 కోట్లు, ప్రస్తుతం టోల్ వసూలు చేస్తున్న ఈగల్ ఇన్‌ఫ్రా రూ.5643 కోట్ల మేర బిడ్‌లను కోట్ చేశాయి. అత్యధికంగా కోట్ చేసిన ఐఆర్‌బీ సంస్థను.. 'మరింత అధికంగా చెల్లిస్తారా?' అని ప్రభుత్వ వర్గాలు కోరగా రూ.7380 కోట్లు చెల్లించేందుకు ఆ సంస్థ ముందుకొచ్చినట్లు అధికారులు ప్రకటించారు. ఓఆర్ఆర్‌పై ఏటా పెరిగే వాహనాలు, 3 నుంచి 4 శాతం మేర పెరిగే టోల్ చార్జీలతో ఏడాదికి కనీసం ఐదు శాతం ఆదాయం పెరిగినా సర్కారుకు భారీగా ఆదాయం పెరుగుతుంది. అయినా.. 30 ఏళ్ల లీజుకు బేస్‌ప్రైస్‌ను రూ.7300 కోట్లుగా నిర్ణయించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా.. ఓఆర్ఆర్ టీవోటీ ఫైనాన్షియల్ బిడ్ల ఇనిషియల్ ఎస్టిమేటెడ్ కన్సెషన్ వాల్యూను (ఐఈసీవీ) నిర్ధారించడానికి అప్పట్లో ఏర్పాటు చేసిన ఐఏఎస్ అధికారుల కమిటీయే రూ.7380 కోట్ల లీజు చెల్లించడానికి ఐఆర్‌బీ సంస్థను ఒప్పించినట్లు తెలిసింది. ఈ మేరకు.. గత ఏడాది ఆగస్టు 12 అర్ధరాత్రి నుంచి ఓఆర్ఆర్ ప్రైవేటు సంస్థ లీజులోకి వెళ్లగా, 11వ తేదీనే ప్రభుత్వానికి రూ.7380 కోట్ల చెక్కు అందింది. దాన్ని హెచ్ఎండీఏ ఖాతాలో 12న జమ చేయగా, మరుసటి రోజే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆ సొమ్మును రాష్ట్ర ఖజానాకు మళ్లించారు. ఆ మొత్తాన్ని హైదరాబాద్ మహా నగర అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు వాడతామని.. అప్పటి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రకటించారు. కానీ, ఆ సొమ్మును రైతు రుణమాఫీకి వినియోగించినట్లు సమాచారం.

# రహదారులు రక్తసిక్తం!

» రోడ్డు ప్రమాదాల్లో 11 మంది దుర్మరణం

కొత్తకోట, సదాశివపేట, పటాన్ చెరు, బోయినపల్లి, మార్చి 4: రాష్ట్రంలో రహదారులు రక్తసిక్తమయ్యాయి! వేర్వేరు జిల్లాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 11 మంది దుర్మరణం చెందారు. నిశ్చితార్థానికి వెళ్తున్న కుటుంబసభ్యుల కారు అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో అందులోని వారిలో ఐదుగురు దుర్మరణం చెందారు. మరో ఐదుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటన సోమవారం వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో చోటుచేసుకుంది. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి పట్టణం బసవన్నకుంటకు చెందిన సలీమాబీ మనవడు అలీకి హైదరాబాద్‌లోని ఓ కుటుంబంతో పెళ్లి సంబంధం ఖాయమైంది. సోమవారం హైదరాబాద్‌లో నిశ్చితార్థం ఉన్నందున సలీమా బీ కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం రాత్రి ఎర్టిగా కారులో బళ్లారి నుంచి బయలుదేరారు. అలీ డ్రైవింగ్ చేస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో కొత్తకోట సమీపంలోని బైపాస్ రోడ్డులో వారి కారు జాతీయ రహదారి పక్కనున్న చెట్టును ఢీకొంది. కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. దీంతో ఘటనా స్థలంలోనే అబ్దుల్ రెహమాన్ (39), రుమానా (2), సలీమా బీ (95), రోషిణి (4), హసిఫా రిఫాత్ (7 నెలలు) మృతి చెందారు. అలీ, షఫీ, హసన్, ఖదీర్, అబీబ్‌లకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. తర్వాత షఫీ, హసన్, ఖదీర్, అబీబ్‌లను మెరుగైన వైద్యం కోసం కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్పై మంజునాథ్‌రెడ్డి తెలిపారు. అతివేగం, నిద్రమత్తు ప్రమాదానికి కారణంగా తెలుస్తోందన్నారు. ఈ ప్రమాదంలో చిన్నదెబ్బ కూడా తగలకుండా సమీరా (8) బయటపడింది.



వనపర్తి జిల్లా ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

ఇదిలా ఉండగా.. బంధువు అంత్యక్రియలకు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులిద్దరూ దుర్మరణంపాలైన ఘటన కామారెడ్డి జిల్లాలో సోమవారం చోటుచేసుకుంది. సదాశివనగర్‌కు చెందిన దంపతులు ఏనుగు జనార్దన్ రెడ్డి(49), ఏనుగు ప్రతిభ (42) మండలంలోని పద్మాజీవాడి గ్రామంలో తమ బంధువు మృతి చెందడంతో అంత్యక్రియలకు స్కూటీపై బయలుదేరారు. పద్మాజీవాడి వద్ద గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి అతివేగంగా ఢీకొట్టడంతో స్కూటీపై నుంచి వారిద్దరూ కింద పడ్డారు. ప్రతిభపై నుంచి వాహనం వెళ్లడంతో ఆమె శరీరం నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందింది. జనార్దన్ కాలుపై నుంచి కూడా వాహనం వెళ్లడంతో కాలు తెగి రోడ్డుకే అతుక్కుపోయింది. అతన్ని వెంటనే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించిన కొద్దిసేపటికే మృతి చెందాడు. కాగా సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఐనోల్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో బిహార్‌కు చెందిన సూరజ్(34), ఉత్తరప్రదేశ్‌కు చెందిన ధర్మేందర్(30) అనే భవన నిర్మాణ కార్మికులు మృతి చెందారు. ఆదివారం రాత్రి పల్సర్ బైక్‌పై పటాన్‌చెరు నుంచి ఐనోల్ మీదుగా కంజర్ల గ్రామం వైపు వెళ్తుండగా గుర్తు తెలియని కారు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. ఇదిలా ఉండగా..రోడ్డు పక్కన పార్క్ చేసివున్న బొలెరో వాహనాన్ని షేక్ మహ్మద్ హుస్సేన్ (14) అనే విద్యార్థి నడుపుతున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. శనివారం జరిగిన ఘటనలో అతను చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందగా వెనుక కూర్చున్న మరో విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సికింద్రాబాద్‌లోని బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.

### ఔటర్‌పై కారు ఢీకొని.. ఆర్మీ జవాన్ దుర్మరణం

నార్సింగ్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు దాటుతుండగా గచ్చిబౌలి నుంచి ఎయిర్ పోర్టు వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆర్మీ జవాను మృతిచెందాడు. నార్సింగ్ వద్ద సోమవారం ఈ ఘటన జరిగింది. ప్రమాదం అనంతరం వాహనం ఆగకుండా వెళ్లిపోయింది. మృతుడు గోల్కొండ ఆర్టిలరీ సెంటర్‌లో ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నారని, అయన పేరు కులాన్ అని నిర్ధారించారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. అయితే కులాన్‌ను ఓ రెడీ మిక్సర్ వాహనం ఢీకొట్టినట్లు సమాచారం. ఘటన తర్వాత కులాన్ మృతదేహం చాలా సేపటి దాకా అక్కడే ఉందని, వాహనదారుల్లో ఎవ్వరూ పట్టించుకోలేదని ఓ పోలీసు అధికారి వెల్లడించారు. మరి.. కులాన్ ఔటర్ రింగ్ రోడ్డువైపుకు ఎందుకు ఎక్కాడు? ఎక్కడికి వెళుతున్నాడు? అనే వివరాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. పాదచారులకు ఔటర్ రింగ్ రోడ్డుపైకి ప్రవేశం ఉండదు. కొంతమంది ఎయిర్ పోర్టుకు గానీ, గచ్చిబౌలికి గానీ వెళ్లాలన్నా ఔటర్ రింగ్‌రోడ్డుపైకి ఎక్కి షేరింగ్ ట్యాక్సీలను ఆపి ఎక్కడం లేదా లిఫ్ట్ అడిగి ఎక్కడం చేస్తుంటారు. ఆ రకంగా ఇతను ఎక్కడకైనా వెళ్లేందుకు వచ్చాడా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# కాళేశ్వరం అక్రమాలపై న్యాయవిచారణ

» కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్ సెక్షన్3(1) ప్రకారం ఆదేశిస్తాం

» సుప్రీంకోర్టు లేదా హైకోర్టు మాజీ న్యాయమూర్తితో ఎంక్వైరీ

» మా విజ్ఞప్తి మేరకు ఆరుగురు సభ్యులతో ఎన్‌డీఎస్‌ఏ కమిటీ

» హైకోర్టుకు లిఖితపూర్వకంగా నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం

» కాంగ్రెస్ నేత నిరంజన్ పిటిషన్ నాలుగు నెలలకు వాయిదా

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అక్రమాలపై న్యాయవిచారణ జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు లిఖిత పూర్వకంగా తెలిపింది. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్-1952 సెక్షన్ 3 (1) అధికారాలను ఉపయోగించుకుని విచారణకు ఆదేశిస్తామని నివేదించింది. కాళేశ్వరం అక్రమాలపై సీబీఐ విచారణ చేపట్టాలని కోరుతూ కాంగ్రెస్ నేత జి.నిరంజన్ దాఖలు చేసిన పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం సోమవారం మరోమారు విచారణ చేపట్టింది. దీనిపై ఏ నిర్ణయం తీసుకున్నారో తెలియజేయాలన్న హైకోర్టు గత ఆదేశాల మేరకు.. అడ్వొకేట్ జనరల్ ఏ.సుదర్శన్ రెడ్డి ప్రభుత్వ వాదనను ధర్మాసనానికి తెలియజేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి పలు అక్రమాలు జరిగినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నిరుడు అక్టోబర్ 24, 25 తేదీల్లో ప్రాజెక్టును సందర్శించి.. ప్రాథమిక విచారణ చేపట్టిందని.. మేడిగడ్డ పిల్లర్ల కుంగుబాటుకు కారణాలు వివరిస్తూ గత నవంబర్ 1న ప్రభుత్వానికి లేఖ రాసిందని తెలిపారు. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు అవసరమని అథారిటీ తన లేఖలో సూచించిందని ఏజీ పేర్కొన్నారు. "డ్యామ్ సేఫ్టీ అథారిటీ లేఖ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దర్యాప్తునకు ఆదేశించింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రాథమిక దర్యాప్తును పూర్తిచేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. సదరు ప్రాథమిక నివేదిక ఆధారంగా ప్రభుత్వం పలుచర్యలు తీసుకుంది. ఈఎన్సీ (ఐ) రామగుండం ఎన్.వెంకటేశ్వర్లు సర్వీసును టెర్మినేట్ చేశాం. దాంతోపాటు ఈఎన్సీ (జనరల్)ని రాజీనామా చేయాల్సిందిగా కోరాం. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తుది నివేదిక వచ్చిన తర్వాత బాధ్యులైన అధికారులపై పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటాం." అని వివరించారు. అలాగే.. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలంటూ ఫిబ్రవరి 13న రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌డీఎస్‌ఏకి లేఖ రాసిందని.. ఈమేరకు ఆరుగురు సభ్యులతో ఎన్‌డీఎస్‌ఏ ఒక కమిటీని ఏర్పాటు చేస్తూ మార్చి 1న ఆదేశాలిచ్చిందని వెల్లడించారు. బరాజ్‌ల దుస్థితికి కారణాలు.. పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలను కమిటీ సిఫారసు చేయనుందని చెప్పారు. ప్రభుత్వ వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల నేపథ్యంలో విచారణను నాలుగు నెలలకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

## క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

● నల్లగొండ ప్రథమ స్థానం, సూర్యాపేట ద్వితీయ స్థానం



నల్లగొండ జట్టు సభ్యులకు బహుమతి అందజేస్తున్న జైవీర్‌రెడ్డి

**నాగార్జున సాగర్, మార్చి 4:** క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. రెండురోజులుగా నాగార్జున సాగర్ హిల్ కాలనీలోని బీసీ గురుకుల పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్న కుందూరు జానారెడ్డి చాలెంజ్ ట్రోఫీ అంతర్ జిల్లాల సీనియర్ పురుషుల కబడ్డీ పోటీలు సోమవారం రాత్రి ముగిశాయి. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై విజేతలైన జట్లకు బహుమతులు అందజేసి మాట్లాడారు. క్రీడలు యువతలో ఆత్మస్థైర్యం పెంపొందిస్తాయని, అలాగే శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న 33 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొనగా పోటీల్లో నల్లగొండ జిల్లా జట్టు ప్రథమ, సూర్యాపేట జిల్లా ద్వితీయ స్థానం, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాలు తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నాయి. కార్యక్రమంలో రాష్ట్ర ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు జగదీశ్వర్‌యాదవ్, జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భూలోకరావు, కర్తయ్య, ప్రసాద్, సుందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నర్సింహ, రాంబాబు, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి

**పెద్దఅడిశర్లపల్లి, మార్చి 4:** ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. గుడిపల్లి మండలంలోని వేంకటేశ్వరస్వామి జాతర సందర్భంగా సోమవారం దేవాలయలలో ఆయన ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని దేవాలయ కమిటీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు అలుగుబెల్లి వెంకటేశ్వరరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు తేరా మణిపాల్‌రెడ్డి, జాలే నర్సింహారెడ్డి, వేణుధర్‌రెడ్డి, దేవాలయ చైర్మన్ గజ్జెల వెంకటేశ్వరరెడ్డి, పార్టీ మండలాల అధ్యక్షులు వీరబోయిన ఎల్లయ్య, గోవర్ధన్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, సత్యంరెడ్డి, వెంకట్‌రెడ్డి, పరమేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

## నీటిఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి : ఎంపీపీ

**నార్కట్‌పల్లి, మార్చి 4:** వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లో నీటి ఎద్దడి నివారణ చర్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్ రెడ్డి సూచించారు. నార్కట్‌పల్లి ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం పంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో నీటి సరఫరాపై సమీక్ష నిర్వహించారు. ఏఏ గ్రామాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందో గుర్తించి ప్రత్యామ్నాయ చర్యలకు ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఉమేశ్‌చారి, తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీవో సుధాకర్ పాల్గొన్నారు.

## వివిధ శాఖల్లో సమస్యలను పరిష్కరించాలి



కలెక్టర్‌ను కలసి సన్మానిస్తున్న నాయకులు

**నల్లగొండ టౌన్, మార్చి 4:** జిల్లాలోని వివిధ శాఖల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నాగిళ్ల మురళి, జిల్లా కార్యదర్శి శేఖర్ రెడ్డి కోరారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన టీఎన్జీవోస్ జిల్లా కార్యవర్గం సోమవారం కలెక్టర్ హరిచందన దాసరిని కలెక్టరేట్‌లో మార్యదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు శాలువా, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. రాబోయే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టీఎన్జీవోస్ భవన్‌లో మార్చి 5,6,7 తేదీల్లో నిర్వహించే కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చేపూరి నరసింహాచారి, వెల్లంకి మాధవి, డీఐ రాజు, జిల్లా కోశాధికారి మేడి జయరావు, నాయకులు తిరునగరి రమాదేవి, భాస్కర్, లక్ష్మి, రమ్యసుధ, లక్ష్మయ్య, వెంకట్‌రెడ్డి, మనోజ్‌ప్రదీప్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ దసరా పండుగ లక్కీడ్రా

**నల్లగొండ, మార్చి 4:** నల్లగొండ రీజియన్ పరిధిలో దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన ప్రయాణికుల కోసం ప్రవేశపెట్టిన లక్కీడ్రాను సోమవారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో అధికారులు డ్రా తీశారు. పురుషులు, మహిళల ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన లక్కీడ్రాను నిబంధనల మేరకు తీశారు. ఐదుగురు మహిళలు, ఐదుగురు పురుషుల ప్రయాణికులను డ్రా ద్వారా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎం శ్రీదేవి మాట్లాడుతూ లక్కీడ్రాలో గెలుపొందిన విజేతలకు త్వరలో బహుమతులు అందజేస్తామని పేర్కొంటూ శుభాకాంక్షలు తెలిపారు.

## రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలి : ఐలయ్య

**శాలిగౌరారం, మార్చి 4:** కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రెండు లక్షలలోపు రుణమాఫీ వెంటనే చేస్తామని, రైతులకు ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి అమలుచేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని బొల్లారం యాదగిరి భవన్‌లో సోమవారం నిర్వహించిన వ్యకాస సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీతో పాటు కరువుతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేస్తూ బీమాసౌకర్యం కల్పించాలని అన్నారు. సమావేశంలో నాయకులు సిరిపంగి ఆంజనేయులు, బొజ్జ చిన్నవెంకులు, చలకాని మల్లయ్య, బుచ్చిరాములు, రాములు, లింగయ్య, దాసరి దేవచిత్రం, యాదయ్య, శ్రీనివాస్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## వాగుల నుంచి ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు

**దేవరకొండ, మార్చి 4:** దేవరకొండ మండలంలోని తాటికోలు, ముదిగొండ, మైనంపల్లి వాగుల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే దాడులు నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటామని దేవరకొండ సీఐ నర్సింహులు హెచ్చరించారు. సోమవారం దేవరకొండలో విలేకరులతో మాట్లాడారు. తాటికోలు వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు.

## ఆలయ అభివృద్ధికి కృషి : జానారెడ్డి

**హాలియా, మార్చి 4:** ఆలయ అభివృద్ధికి పాలక మండలి సభ్యులు కృషి చేయాలని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. మండలంలోని పేరూరు గ్రామంలోని శ్రీస్వయం భూసోమేశ్వరస్వామి సోమవారం ఆలయ ఈవో వెంకటనారాయణ, నూతన చైర్మన్ రిక్కల కొండారెడ్డితో పాటు పాలక మండలి సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు.



# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి

**గుర్రంపోడు, మార్చి 4:** పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్నారు. ఈ నెల 11వ తేదీ నుంచి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీపీల ఫోరం అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వర్లు, మాజీ జడ్పీటీసీ గాలి రవికుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కంచర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తగుళ్ల సర్వయ్యయాదవ్, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు జాల చినసత్తయ్యయాదవ్, నాయకులు సయ్యద్‌మియా, జగదీశ్వర్‌రెడ్డి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

### విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

**త్రిపురారం:** కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్, బాబుసాయిపేటలో రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2 కోట్ల 25 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించి కస్తూర్బాగాంధీ పాఠశాల భవనం, కర్రవారిగూడెంలో సీసీ రోడ్డును ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సాగర్ నియోజకవర్గంలో గతంలో జానారెడ్డి చేసిన అభివృద్ధి పనులు కొనసాగిస్తానన్నారు. కార్యక్రమంలో ఎమెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఎంపీపీ అనుముల పాండమ్మ, జడ్పీటీసీ ధనావత్ భారతి, ఎంఈవో బాలాజీనాయక్, ట్రాన్స్‌కో సబ్ ఇంజనీర్ రవీందర్‌రెడ్డి, నాయకులు అనుముల శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌నాయక్, బుచ్చిరెడ్డి, వెంకట్‌రెడ్డి, యాదగిరి, భాస్కర్, రవినాయక్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గుర్రంపోడులో కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి



జానారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు నాగశిరీష, మంగ్తనాయక్

## కాంగ్రెస్‌లో చేరిన ఇద్దరు కౌన్సిలర్లు

● నందికొండలో ఆరుకు చేరిన కాంగ్రెస్ బలం

**నాగార్జునసాగర్, మార్చి 4:** నందికొండ మునిసిపాలిటీలో ఇద్దరు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో మునిసిపాలిటీలో కాంగ్రెస్ బలం ఆరుకు చేరుకుంది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన 1వ వార్డు కౌన్సిలర్ మంగ్తనాయక్, 3వ వార్డు కౌన్సిలర్ నాగశిరీష మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి సమక్షంలో సోమవారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీలో చేరారు. నందికొండ మునిసిపాలిటీలో మొత్తం 12 వార్డులు ఉండగా 9 బీఆర్ఎస్, 3 వార్డులు కాంగ్రెస్ కైవసం చేసుకుంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన 2వ వార్డు కౌన్సిలర్ సత్తమ్మ గుండెపోటుతో మృతి చెందడంతో ప్రస్తుతం ఉన్న 11 మంది కౌన్సిలర్లలో తొమ్మిది మంది బీఆర్ఎస్ ఇద్దరు కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల సమయంలో 6, 9వ వార్డు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో బీఆర్ఎస్ 7, కాంగ్రెస్ పార్టీకి 4గురు కౌన్సిలర్లు ఉన్నారు. చైర్మన్, వైస్ చైర్మన్లు ఇద్దరు బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే. వారి ఏకపక్ష నిర్ణయాలకు బీఆర్ఎస్ కౌన్సిలర్లతో సహా కాంగ్రెస్ కౌన్సిలర్లు గత నెల 15న అవిశ్వాస తీర్మానం పెట్టగా చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులు కోల్పోయారు. ప్రస్తుతం చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో తాజాగా సోమవారం 1,3వ వార్డు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో కాంగ్రెస్ సంఖ్య 6 కు చేరింది. మరో రెండు మూడు రోజుల్లో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, రామకృష్ణ, శంకర్, నాగరాజు, శ్రీను, బాలాజీ పాల్గొన్నారు.

# మిర్యాలగూడ డీఈపై బదిలీ వేటు

● విధి నిర్వహణలో నిర్లక్ష్యంతో చర్యలు
● రెప్పపాటు వ్యవధిలో కూడా కరెంటు పోకూడదు
● టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్

**నల్లగొండటౌన్, మార్చి 4:** విధి నిర్వహణలో నిర్లక్ష్యంపై మిర్యాలగూడ విద్యుత్ డీఈ వెంకటేశ్వర్లును బదిలీచేస్తూ టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలో విద్యుత్‌శాఖ అధికారులతో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. విద్యుత్ సరఫరాలో అధికారుల అలసత్వాన్ని ఎంతమాత్రం సహించేది లేదని, కనురెప్పపాటులో కూడా కరెంటు పోవడానికి వీలులేదన్నారు. విద్యుత్ కోతల కారణంగా ఏ ఒక్కరి మడి కూడా ఎండిపోకుండా అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. డిమాండ్ మేరకు విద్యుత్ సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, ఎక్కడా కోతలు అనేవి ఉండకూడదన్నారు. విద్యుత్ సరఫరాలో అసలు ట్రిప్ సమస్య ఉండకూడదని, ఉంటే నెలకు ఒకటి మాత్రమే ఉండాలని సూచించారు. ఇటీవల మిర్యాలగూడ డివిజన్‌లో రైతులు నిర్వహించిన ఆందోళనపై మిర్యాలగూడ డీఈ వెంకటేశ్వర్లును వివరణ కోరడంతో ఆయన సరిగా సమాధానం ఇవ్వకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే ఆయనను బదిలీపై కార్పొరేట్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. విద్యుత్ బిల్లులను నూరు శాతం వసూలు చేయాలని, ఇచ్చిన లక్ష్యం పూర్తిచేయాలన్నారు. గృహజ్యోతి జీరో బిల్లుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని, ప్రతినెలా 9వ తేదీలోగా ఈ ప్రక్రియను పూర్తిచేయాలన్నారు. ఆలస్యమైతే వినియోగదారుల నుంచి సమస్యలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. అనంతరం సమావేశ మందిర ఆవరణలో గల ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రాన్ని పరిశీలించారు. రోజుకు ఎన్ని ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు వస్తున్నాయని, ఏ కారణంతో అధికంగా వస్తున్నాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో కంపెనీ ఆపరేషన్ డైరెక్టర్ ఎన్.నర్సింహులు, సీజీఎం భిక్షపతి, సర్కిల్ ఎస్ఈ టీఆర్ చంద్రమోహన్, వివిధ డివిజన్ల డీఈలు, ఏడీఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.

# విద్యార్థినులతో ఉపాధ్యాయుల అసభ్య ప్రవర్తన

● పాఠశాలలో ఆందోళనకు దిగిన తల్లిదండ్రులు
● ఇద్దరు ఉపాధ్యాయులపై దాడి



ఉపాధ్యాయులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

**నల్లగొండ/నల్లగొండటౌన్, మార్చి 4:** విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన ఇద్దరు ఉపాధ్యాయులపై తల్లిదండ్రులు దాడి చేశారు. సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని డైట్ ప్రాథమిక పాఠశాలలో ఈ సంఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నల్లగొండ పట్టణంలో గల డైట్ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి వరకు 171మంది విద్యనభ్యసిస్తున్నారు. తొమ్మిది మంది సిబ్బంది కాగా ప్రధానోపాధ్యాయుడు పోలా వెంకటయ్య, ఉపాధ్యాయుడు పి.శ్యాంసుందర్, ఏడుగురు ఉపాధ్యాయినులు ఉన్నారు. తరగతి గది నుంచి విద్యార్థినులు బయటకు వచ్చిన సమయంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య, ఉపాధ్యాయుడు శ్యాంసుందర్ కొద్ది రోజులుగా అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. బాలికల శరీరంపై ఎక్కడ పడితే అక్కడ తడుము తూ చేతులు వేస్తుండటం, బుగ్గలపై ముద్దులు పెడుతుండటం తో ఎవరికీ చెప్పుకోలేక ఇబ్బందులు పడ్డారు. బాలికలు శనివారం పాఠశాలలోని ఓ మహిళా ఉపాధ్యాయురాలికి తమ సమస్యను వివరించగా, తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. విషయం తెలుసుకున్న బాధిత విద్యార్థినుల తల్లిదండ్రులు సోమవారం డైట్ ప్రాథమిక పాఠశాలకు చేరుకుని ఆందోళన చేపట్టారు. ఓ దశలో సదరు ఉపాధ్యాయులపై దాడికి పాల్పడ్డారు. ఆందోళన తీవ్రతరం కావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నల్లగొండ ఎంఈవో అరుంధతి, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహులు వచ్చి పాఠశాలలోని విద్యార్థినులను, సహచర ఉపాధ్యాయులను విచారించారు. బాధిత విద్యార్థినుల తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదు తీసుకున్న టూటౌన్ పోలీసులు పోల వెంకటయ్య, శ్యాంసుందర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై డీఈవో బొల్లారం భిక్షపతి స్పందిస్తూ ప్రస్తుతం విచారణ జరుగుతున్నందున స్పష్టత వచ్చిన తర్వాత జిల్లా కలెక్టర్ హరిచందనకు నివేదిక అందజేస్తామని తెలిపారు. విచారణలో ఉపాధ్యాయులు విద్యార్థునులతో అసభ్యంగా ప్రవర్తించినట్లు తేలితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

# అభివృద్ధి పేరిట నిధులు మళ్లింపుపై చర్యలు




సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

**రామగిరి, మార్చి 4:** నీలగిరి పట్టణంలో అభివృద్ధి పేరుతో అవకతవకలు పాల్పడి నిధులు మళ్లించారని, గత ప్రభుత్వ హయాంలో కొందరు అధికారులు చేసిన అవినీతి, అక్రమాలు చేశారని, తప్పు చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మునిసిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రీన్‌బడ్జెట్ పేరుతో హరితహారం మొక్కలకు రూ.18 కోట్లు ఖర్చు చేసినట్లు చూపించారని, ఇష్టానుసారంగా కొన్నింటి అంచనాలు పెంచుకుంటూపోయి అవినీతి చేశారని తెలిపారు. ముందుగా గతంలో అభివృద్ధి మాటున అక్రమాలకు పాల్పడ్డారని, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ ఖయ్యూంబేగ్ కోరారు. ఇష్టం వచ్చినట్లు ఖర్చులు చూపించి, మునిసిపల్ నిధులను కౌన్సిల్ అనుమతి లేకుండానే ఇతర పనులకు దారి మళ్లించారని, అలాంటి వాటిపై పూర్తిస్థాయి విచారణ జరిపించి సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత పాలనలో సిద్ధిపేట, సిరిసిల్ల వాళ్లు వచ్చి నల్లగొండ మునిసిపాలిటీని కొల్లగొట్టారని ఆరోపించారు. మునిసిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ మాట్లాడుతూ గతంలో శ్మశానవాటికలు, పార్కుల అభివృద్ధి పేరుతో నిధులను దారి మళ్లించారని అన్నారు. రూ.56కోట్లు పట్టణ ప్రగతి నిధులు, రూ.36కోట్ల టీఎస్ బీపాస్, రూ.17 కోట్ల ఎల్ఆర్ఎస్ నిధులతో వార్డుల్లో అభివృద్ధి చేయకుండా ఇష్టం వచ్చినట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. వీటన్నింటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ 2014 నుంచి కొంతమంది అధికారులు అక్రమాలకు పాల్పడారని, కొన్ని ఫైళ్ల ను తగులబెట్టి పలువురు ఉద్యోగులు సస్పెండ్ అయ్యారని తెలిపారు. ఎల్ఆర్, పట్టణ ప్రగతి నిధులను అనవసరపు వాటికి ఖర్చు చేసి దుర్వినియోగం చేశారని అన్నారు. చర్లపల్లి పార్కులో రూ.4.85 కోట్లు ఖర్చు చేసినా ఒక్క మనిషి వెళ్లడం లేదన్నారు. రూ.4 కోట్ల సమీకృత మార్కెట్‌ను రూ.8.75 కోట్లకు పెంచారని, గ్రానైట్ బండలు వేసి నిధులు వృథా చేశారని తెలిపారు. జరిగిన అవకతవకలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ హరిచందన దృష్టికి తీసుకెళ్లి విజిలెన్స్ లేదా ఇతర ప్రభుత్వ సంస్థ ద్వారా విచారణ చేయించి తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో మునిసిపల్ కమిషన ర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, ఈఈ రాములు, ఏసీపి నాగిరెడ్డి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి : సీపీఎం



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

**నల్లగొండటౌన్, మార్చి 4:** జిల్లా వ్యాప్తంగా ఎటు చూసినా కరువువిలయ తాండవం చేస్తోందని, బోర్లు ఇంకిపోయి, చెరువులు ఎండిపోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కరువుతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ సీపీఎం బృందం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో నీళ్ల లేక బోర్లు వేయించుకున్నా కూడా నీళ్ల అందే పరిస్థితి లేదన్నారు. సాగర్ ఎడమకాల్వ ద్వారా నీటిని విడుదల చేసి చెరువులు నింపితే కొంతమేర పంటలను కాపాడుకోవచ్చని అన్నారు. అదేవిధంగా ఎస్ఎల్‌బీసీ ద్వారా చెరువులను నింపితే నల్లగొండ, దేవరకొండ, నకిరేకల్ ప్రాంతాల్లో పంటలు కాపాడుకోవచ్చని అన్నారు. కానీ ప్రభుత్వం నీటి విడుదలకు ముందుకు రావడం లేదని ఆరోపించారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు బృందాలుగా ఏర్పడి పంట నష్టం జరిగిన ప్రాంతాల్లో పర్యటించి నష్టం వివరాలను అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని డిమాండ్ చేశారు. రైతులు యాసంగిలో సగం పంటలనే పెట్టారని ఆ సగంలో సగం ఎండిపోయాయని, ఆ పంట కూడా చేతికొస్తుందో రాదోనని రైతులు ఆందోళనలో ఉన్నారని అన్నారు. స్వామినాథన్ కమిషన్, భూపేష్ సింగ్ కమిటీ సిఫార్సుల ఆధారంగా రైతాంగాన్ని ఆదుకోవాలని లేదంటే ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయిన రైతులు ఆత్మహత్యలకు పాల్పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో నాయకులు కందాల ప్రమీల, సయ్యద్ హాశం, పాలడుగు నాగార్జున, ప్రభావతి, వెంకటేశ్వర్లు, సలీం, నర్సిరెడ్డి, కృష్ణారెడ్డి, పద్మ, వరలక్ష్మి, గోవర్ధని తదితరులు పాల్గొన్నారు.

### ఇంటర్ పరీక్షలకు 742 మంది గైర్హాజర్

**నల్లగొండ, మార్చి 4:** జిల్లాలో సోమవారం జరిగిన ఇంటర్ పరీక్షలకు మొత్తం 15,792 మంది విద్యార్థులకు 15,050 మంది హాజరుకాగా 742మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 13,596మందికి 13,087మంది హాజరు కాగా 509 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 2196 మందికి 1963మంది హాజరుకాగా 233 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు.

# రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

● చింతపల్లిలో కాంగ్రెస్ నేత, నార్కట్‌పల్లిలో యువకుడి మృత్యువాత



పాండురంగారెడ్డి



మృతుడు ఉమేష్

**చింతపల్లి, నార్కట్‌పల్లి, మార్చి 4:** జిల్లాలో వేర్వేరు చోట్ల సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా, ఒకరికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదాలు జిల్లాలోని చింతపల్లి, నార్కట్‌పల్లి మండలాల్లో చోటుచేసుకున్నాయి.

హైదరాబాద్ - నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారి చింతపల్లి మండలంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సంబిడి పాండురంగారెడ్డి మృతి చెందాడు. ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కుర్మపల్లి గ్రామానికి చెందిన సంబిడి పాండురంగారెడ్డి వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పాండురంగారెడ్డి హైదరాబాద్‌లో ఉంటూ వారం రోజులకు ఒకసారి తన స్వగ్రామానికి వచ్చి వ్యవసాయం చూసుకొని వెళ్తుంటాడు. ఈ క్రమంలో సోమవారం పాండురంగారెడ్డి తన ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. మండలంలోని మదనాపురం స్టేజీ సమీపంలో కొండమల్లేపల్లి నుంచి శంషాబాద్‌కు వెళ్తున్న డీసీఎం ఢీకొనడంతో పాండురంగారెడ్డి (68)కి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ యాదయ్య తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పాండురంగారెడ్డి భార్య విజితరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని దేవరకొండ సివిల్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ యాదయ్య తెలిపారు. మృతుడు పాండురంగారెడ్డికి భార్య, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. డీసీఎం డ్రైవర్ ప్రమాదం జరిగిన వెంటనే పరారైనట్లు ఎస్ఐ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడైన సంబిడి పాండురంగారెడ్డి మృతి చెందడం పట్ల ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, ఎంపీపీ కొండూరు భవానిపవన్‌కుమార్, డీసీసీ ఉపాధ్యక్షుడు దొంతం సంజీవరెడ్డి, పలువురు కాంగ్రెస్ నేతలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

● హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై నార్కట్‌పల్లి మండల కేంద్రానికి శివారులో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గుంతపల్లి గ్రామానికి చెందిన భార్యాభర్తలైన గుండ్ల ఉమేష్ (30), మమత ద్విచక్రవాహనంపై హైదరాబాద్‌కు వెళ్తున్నారు. మండల కేంద్రానికి శివారులో గల వేణుగోపాలస్వామి ఆలయానికి వెళ్లే ఆర్చి వద్దకు చేరుకోగానే ముందు వెళ్తున్న ట్రాక్టర్ అకస్మాత్తుగా బ్రేక్ వేసి ఆగింది. దీంతో వెనుక నుంచి వస్తున్న ఉమేష్ ద్విచక్ర వాహనం ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో అతని తలకు బలమైన గాయాలయ్యాయి. వెనుక కూర్చున్న మమతకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులిద్దరినీ నార్కట్‌పల్లిలోని కామినేని వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఉమేష్ సాయంత్రం మృతి చెందాడు. అతని భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అతిరెడ్డి తెలిపారు.

## 116 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

**దామరచర్ల, దేవరకొండ, మార్చి 4:** జిల్లాలోని రెండు ప్రాంతాల్లో అక్రమంగా తరలిస్తున్న 116 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటనలు దామచర్ల, దేవరకొండలో చోటుచేసుకున్నాయి. వివరాల్లోకి వెళితే... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పిడుగురాళ్లకు అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. దామచర్ల ఎస్ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం సోమవారం ఉదయం తెల్లవారుజామున 5 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు డీసీఎం వ్యాన్‌లో 90 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని నల్లగొండ నుంచి దామరచర్ల మీదుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పిడుగురాళ్లకు తరలిస్తున్నారు. వాడపల్లి పోలీసులు చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేసి పట్టుకున్నారు. రేషన్‌బియ్యాన్ని స్టేషన్‌కు తరలించి పట్టుబడిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవి తెలిపారు

● దేవరకొండలో అక్రమంగా తరలిస్తున్న 26 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు డీటీసీఎస్ హనుమంతు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ దేవరకొండ మండలం పాత్లావత్‌తండాకు చెందిన పాత్లావత్ శీను ఆటోలో కల్వకుర్తికి అక్రమంగా తరలిస్తున్న 26 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని ఆదివారం రాత్రి దేవరకొండలో పట్టుకున్నట్లు తెలిపారు. ఆటో, బియ్యాన్ని సీజ్‌చేసి శీనుపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అక్రమంగా రేషన్‌బియ్యాన్ని తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## గంజాయి సరఫరా చేసే వ్యక్తి అరెస్ట్

**చిట్యాల, మార్చి 4:** అక్రమంగా గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐలు సైదాబాబు, నవీన్‌కుమార్ తెలిపారు. మండలంలోని పెద్దకాపర్తి గ్రామానికి చెందిన రాపోలు రాజు గంజాయి విక్రయిస్తున్నాడన్న విశ్వసనీయ సమాచారం మేరకు ఈ నెల 3వ తేదీన పోలీసులు అతని ఇంటికి వెళ్లారు. పోలీసులను గమనించిన రాజు పారిపోవడానికి ప్రయత్నించాడు. దీంతో అతడిని పట్టుకొని విచారించగా తన దగ్గర గంజాయి ఉందని, దానిని చత్తీస్‌ఘడ్ నుంచి కొనుగోలు చేసి పెద్దకాపర్తిలోని యువకులకు విక్రయిస్తున్నట్లు తెలిపాడు. అతని వద్ద 60 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు వారు తెలిపారు.

## బత్తాయి తోట దగ్ధం

**పెద్దఅడిశర్లపల్లి, మార్చి 4:** విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బత్తాయి తోట దగ్ధమైంది. ఈ సంఘటన గుడిపల్లి మండలంలోని సింగరాజుపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, బాధిత రైతుల తెలిపిన వివరాల ప్రకారం... సింగరాజుపల్లి గ్రామానికి చెందిన పడాల సైదులు, పడాల చిన్నయ్య, వడ్లపల్లి నర్సిరెడ్డి చెందిన బత్తాయి తోట విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షార్ట్‌సర్క్యూట్‌తో నిప్పులు చెలరేగాయి. దీంతో పొలంలో ఉన్న ఎండు గడ్డికి నిప్పంటుకుంది. ఈ మంటలు పాకి తోటలో పరిచిన డ్రిప్పు పైపులు, 300 బత్తాయి చెట్లు కాలిపోయాయని బాధిత రైతులు తెలిపారు. రూ. లక్షల్లో నష్టం వాటిల్లిందని వాపోయారు. ఆరుగాలం పడిన కష్టమంతా బూడిదపాలైయిందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

## నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్

**అడవిదేవులపల్లి, మార్చి 4:** ఆటోలో ప్రయాణించిన ఒక మహిళ తన నల్లపూసల బంగారు గొలుసును ఆటోలో మరిచిపోగా ఆ బంగారు గొలుసును పోలీసుల సమక్షంలో ప్రయాణికురాలికి ఓ ఆటో డ్రైవర్ అందజేసి తన నిజాయితీ చాటుకున్నాడు. ఈ ఘటన అడవిదేవులపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అడవిదేవులపల్లికి చెందిన ఏకుల మహేష్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పెద్దపూరకు చెందిన రమావత్ లక్ష్మి ఫిబ్రవరి 25వ తేదీన అడవిదేవులపల్లి మండలం లావూడితండాలో ఓ శుభకార్యానికి హాజరై అనంతరం ఏకుల మహేష్ ఆటోలో ఎక్కి మిర్యాలగూడ మండలం తుంగపాడులో తన తులంన్నర నల్లపూసల గొలుసును ఆటోలోనే మరిచిపోయి దిగింది. కాగా ఆటో సీటును సరిచేసుకుంటుండగా సీటు వద్ద నల్లపూసల గొలుసు కనిపించడంతో ఆ వివరాలను వాట్సప్ గ్రూప్‌లో పోస్ట్ చేశాడు. అనంతరం బంగారాన్ని అడవిదేవులపల్లి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. వాట్సప్‌లో బంగారు గొలుసు వివరాలు తెలుసుకున్న సదరు మహిళ లక్ష్మి ఆ గొలుసు తనదేనని పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఆధారాలు చూపించగా నిర్ధారించుకున్న పోలీసులు మహేష్ సమక్షంలో మహిళకు అందజేశారు. నిజాయితీ చాటుకున్న మహేష్‌ను ఎస్ఐ హరిబాబు అభినందించి రూ.2వేల పారితోషికాన్ని అందించారు.